# కులంత్రాసులో ప్రాణం విలువ

''రాధా! రాధా!"

ఆపిలుపికి పచ్చని చెట్లన్నీ తలలూపాయి. ఎగిరే పక్షులన్నీ తల తిప్పిచూసాయి. కాలేజీనుంచి యింటికి వెడుతున్న రాధ ఉలిక్కిపడింది. ఆ పిలుపు ఆమెకు మురళి నాదంలా వినబడింది రాధ రాధై పోయింది, చేతిలో ఉన్న పుస్తకాలు పక్కకు పడేసింది. పరుగెత్తుకుంటూ తనవైపే వస్తున్న అర్జున్‌కి ఎదురుగా పరుగెత్తింది.

"రాధా! రాధా! మనం...." ఆయాసంతో ఇక మాట్లాడలేక పోయాడు.

"ఏమయింది అర్జున్! అలా ఉన్నావేం" రాధ కంగారుగా అడిగింది.

"ఏది జరగాలో అదే జరిగింది రాధా!" అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అతని కన్నీళ్ళు చూసి రాధ కళ్ళలో కూడా నీళ్ళు చిమ్మాయి.

"రాధా! మన మింకకలుసుకోలేం! కలుసుకుంటే జరిగేదేమిటో

తెలుసా! ఇవిగో వావుదెబ్బలు" అంటూ చొక్కా ఎత్తి చూపించాడు"

ఒళ్ళంతా దెబ్బలే. రక్తం ఎండిచారికలు కట్టింది

"అయ్యో! ఈ దెబ్బలేమిటి అర్జున్? అసలేం జరిగింది" ఆమెకళ్ళ నుండి కన్నీరు జలజలారాలింది.

"రాధా! బాధపడి ప్రయోజనంలేదు. ఇందాకానన్ను మానాయన్ని పంచాయితీ ఆఫీసు దగ్గరకి పిలిపించారు. గ్రామ పెద్దల మధ్యలో మీ నాన్నగారు కూర్చొని ఉన్నారు.

"సాయంకాలంలోపుగా నీ కొడుకుని ఈ వూరు నుంచి పంపి చెయ్యాలి. లేకపోతే మీ శవాలె మిగులుతాయి! జాగ్రత్త" అంటు బెదిరించారు.

"చిత్తంబాబు! అలాగె పంపిచేత్తా!" నన్నాడు మానాయన. కాని నేను "నే చేసిన తప్పేమిటని" అడిగాను.

గ్రామ పెద్దలు కళ్ళెర్రచేసారు. నా ప్రశ్నకి సమాధానంగా నన్ను కర్రలతో చావకొట్టించారు. మా నాయన వాళ్ళని కాళ్ళు పట్టుకుని మదిమాలాడు– అందుకే నన్ను వదిలేసారు."

"ఎంత పని జరిగింది అర్జున్! నామూలంగా నీకెన్ని బాధలొచ్చాయి."

"అప్పుడే సాయంకాలమవుతోంది రాధా! నేనీవూరు వదలివెళ్ళిపోవాలి. లేకపోతె నన్ను చంపేస్తారు. రాధా! నన్ను చంపేస్తారు? కాని నాకు పారిపోవాలని లేదు రాధా?" రాధ రెండుచేతులు పట్టుకుని వెక్కివెక్కి ఏడ్చాడు అర్జున్.

రాధ సమాధానం చెప్పలేకపోయింది.

"రాధా! మనం పెళ్ళి చేసుకుందాం? రాధా! మనం పెళ్ళి చేసుకుందాం!"

"పెళ్ళా! మా నాన్న చంపేస్తాడు అర్జున్! మా నాన్న చంపేస్తాడు. రాధ వెక్కి వెక్కి ఏడ్చింది.

అర్జున్ స్వాధీనంలో లేని రెండు చేతులతో ఆమెను పట్టుకుని తన హృదయానికి హత్తుకున్నాడు. కాని రాధ అతనికి దూరంగా జరిగింది. ఆమెలో ఏదో తెలియని భయం ఆవరించింది.

రాధ తండ్రి చలపతి బాగా ఆస్తిపరుడు. ఆ చుట్టుపక్కల పలుకుబడి చాలా ఉంది. అతనికి లేకలేక రాధ, ఆమె వెనుక కొడుకు సూర్యం పుట్టారు. చిన్నతనం నుంచి రాధ చాలా చురుకైంది. ఆమెను డాక్టర్ చదివించాలని ఆ తల్లి తండ్రులకోరిక. రాధ పదవ తరగతి మొదటి తరగతిలో పాసవడమేకాదు ఆ జిల్లాకే ప్రథమస్థానం వచ్చింది. ఆ తల్లి తండ్రుల సంతోషానికి అంతులేదు. ఇంటరులో చేరి మరింత మంచి మార్కులు తెచ్చుకుంటోంది. మొదటి సంవత్సరం మొదటి తరగతిలో పాసయింది. రెండవ సంవత్సరంలో అడుగు పెట్టగానె అర్జున్‌తో పరిచయమయింది. అర్జున్ ఇంటర్ రెండుసార్లు తప్పాడు. ఎక్కడా ఉద్యోగంలో చేరలేరు. అతని తండ్రి సోముడు రాధ తండ్రి దగ్గర పాలేరుగా పనిచేస్తున్నాడు.

సోముడు పాలేరు అయినా ఆ యింటి పనులన్నీ చూస్తూఉంటాడు. దొడ్లో కాయగూరలు పెంచడం, బయట పొలంపనులు అన్నీ చూసుకుంటాడు. చలపతిగారికి నమ్మినబంటు సోముడు. సోముడికి ముగ్గురూ కొడుకులే. పెద్ద కొడుకు అర్జున్ మొదటినుంచి పట్నంలో హాస్టల్లో ఉండి చదువుకుంటున్నాడు. పదవతరగతి పాసయిన తరువాత ఎక్కువగా ఆ పల్లెకు రావడం మొదలు పెట్టాడు. తండ్రితోపాటు చలపతిగారి యింటికి తరచు వచ్చేవాడు. దూరంగా నిలబడి సూర్యంతో, రాధతో ఎన్నో విషయాలు మాట్లాడెవాడు. రాధకూడా ఎంతో సరదాగా

అతనితో మాట్లాడేది.

వయసు వచ్చినకొద్దీ అర్జునకి రాధ ప్రాణసమానమైపోయింది. ఆమె అంటె అతనికెందుకిష్టమో అతనికే తెలీదు.

రాధ కాలేజీలో చేరిన తరువాత అర్జున్ తరచు ఆమెను కాలేజీలోనె కలుసుకుంటున్నాడు. కాలేజీనుంచి అడ్డదారిని వస్తే అన్నీ పంట పొలాలె. చెరకు, అరటి తోటలుకూడా ఉన్నాయి. ఆ తోటల మధ్యలో కూర్చుని రాధ, సూర్యం, అర్జున్ కబుర్లు చెప్పుకునేవారు.

ఒకనాడు ఆ ముగ్గురు చలపతిగారి కంటపడ్డారు "పట్నంలో చదివె సోమన్న కొడుకు తరచు ఎందుకు వస్తున్నట్టు". అయిన ఆలోచించారు. ఏదో అనుమానం వచ్చింది. వయసు వచ్చిన కూతురు. ఆయనకు పట్టరాని కోపం వచ్చింది.

"ఎవర్రా అక్కడ! నీకు చదువులేదా! నా కూతురితో కూర్చుని కబుర్లు చెప్పడానికి ఎంత ధైర్యంరా నీకు. ఈసారి నాకంట పడ్డావంటె చంపేస్తాను! జాగ్రత్త" ఆయన కోపంతో ఊగిపోయారు. అర్జున్ చాలా భయపడ్డాడు. అక్కడనుంచి పరుగెత్తుతూ యింటికి పారిపోయాడు.

"నడు యింటికి? సిగ్గులేనిదాన!" అంటు కూతురుమీద అరిచాడు.

తండ్రికి అంతకోపం రావడం రాధ, సూర్యం ఎప్పుడూ చూడలేదు. ఇద్దరు భయంతో గడగడ వణికిపోయారు.

తండ్రి వెనకే తలవంచుకుని ఇంటిదారి పట్టారు. చలపతిగారు అంతకోపంలోను ఇంట్లోఅడుపెట్టాడు అతనిభార్య మాణిక్యమ్మ కంగారు పడింది. కాళ్ళు కడుక్కోడానికి ఇత్తడి చెంబుతో నీళ్ళు అందించింది.

వీళ్ళిద్దరికి ఈపూట అన్నం పెట్టకు. దాన్ని చదువుమాన్పించి ఇంట్లో కూర్చోపెట్టు" ఆవిడ అందించిన తుండుతో తుడుచుకుంటూ లోపలికి వెళ్ళిపోయాడు. జరిగిందేమిటో ఆవిడకు ఎంత ఆలోచించినా

అంతు పట్టలేదు.

"అదే తెలుస్తుందిలే" అనుకుంది. కాని పిల్లలేదో తప్పు చేసుంటారని మాత్రం ఊహించుకుంది.

"వాళ్ళనే అడిగి మెల్లగా తెలుసుకోవచ్చనుకుంది. సాయంకాలం సోముడు పొలంనుంచి యింటికి వచ్చాడు.

అతన్ని చూడగానె చలపతిగారికోపం తారాస్థాయికి చేరుకుంది.

"ఏరా! నీ కొడుక్కి పనిలేదురా! చదువుకునే ఆడపిల్లల వెంట పడి తిరుగుతాడురా? వాడికి బుద్ధిలేదురా? ఈసారి వూళ్ళో కనబడితే చంపేస్తా జాగ్రత్త" చలపతిగారి మాటలు పిడుగులు పడినట్లనిపించాయి. సోముడు కంగారు పడిపోయాడు.

"వాడికేమి తెల్వాదు బాబూ! నే సెబుతాలె బాబు" అంటు బతిమాలాడు.

కాస్త కోపం చల్లారినట్లుగా ఆయన లోపలకి వెళ్ళిపోయాడు. సోముడు పనిలో లీనమయ్యాడు.

మాణిక్యమ్మగారికి సంగతేమిటో అర్థమయింది. ఆమె కూడా చాలా బాధపడింది. ఆరాత్రి ఆపిల్లకు ఎన్నోవిధాల నచ్చచెప్పటానికి ప్రయత్నించింది.

"అమ్మా! రాధా! నీకు పదిహేను సంవత్సరాలుకదా! అలా పరాయి మగ పిల్లలతో మాట్లాడకూడదమ్మా!"

"కాలేజీలో అందరితో మాట్లాడుతున్నాకదమ్మా!"

"అందరితో మాట్లాడితే తప్పులేదమ్మా!"

"అలా వంటరిగా ఎవరితో మాట్లాడ కూడదమ్మా! మగ పిల్లలకి దూరంగా ఉండాలి తెలిసిందా!"

"తమ్ముడున్నాడని మాట్లాడానమ్మా! ఇంకెప్పుడూ మాట్లాడను"

"ఈవాళ నీవెంట తమ్ముడున్నాడు. రేపు తమ్ముడు లేకపోయినా అతను మాట్లాడొచ్చు పరాయి మగ పిల్లలతో చనువుగా ఉండకూడదు తెలిసిందా!"

"అలాగె నమ్మా!" రాధ వచ్చే దుఃఖాన్ని ఆపుకుంది.

"అర్జున్ మూలంగానె అందరిచేత చివాట్లుతిన్నాను. ఇంకెప్పుడు అతనితో మాట్లాడకూడదు" అనుకున్న రాధ నిద్రలోకి జారిపోయింది.

ఆరాత్రి సోముడు నిద్రపోతున్న కొడుకుని పట్టునికొ చావకొట్టాడు. మరెప్పుడు రాధమ్మతో మాట్లాడవద్దని బెదిరించాడు.

"నిజమే! ఆమె తండ్రికూడా అఘెను చావకొట్టవచ్చు. ఇంక ఆమెను కలవకూడదనుకున్నాడు. అర్జున్ తెల్లవారకుండా లేచి పట్నం వెళ్ళిపోయాడు.

తెల్లవారింది మొదలు రాధకు అసలు భయంప్రారంభమయింది.

"కాలేజీకి నాన్న వెళ్ళనిస్తాడో లేదో?" అనుకుంటూనే రాధ కాలేజీకి వెళ్ళడానికి తెములుతూనెఉంది. పుస్తకాలు తీసుకుని బయలు దేరే సమయానికి తండ్రి ఎదురు వచ్చాడు.

"ఎక్కడికి ప్రయాణం? ముందు లోపలకిపో" అంటు అరిచాడు. ఆకేకలకి వీదుల్లోంచి వెళ్ళే వాళ్ళంతా నిలబడి పోయారు.

రాధ నిలువునా వణికిపోయింది.

"రాధ మరెప్పుడు ఆపొరపాటు చెయ్యనంటోంది. ఇంట్లో ఉండి మాత్రం ఏం చేస్తుంది? తోటిపిల్లలతో కలిసి వెడుతుంది."

"అదేం కుదరదు. ఇప్పుడే వెళ్ళి మా చెల్లెలికొడుకుతో పెళ్ళి కుదుర్చుకువస్తాను. వాడుపట్నంలో మెడిసిన్ చేస్తున్నాడు. ముహూర్తాలు పెట్టించుకు మరీవస్తాను!"

"కనీసం ఇంటరైనా చదవంటే అతను మాత్రం పెళ్ళికి ఒప్పుకుంటాడా?

పిల్ల మరీ బెంగపెట్టుకుంది. చదువుకోనీయండి?"

"లేడావస్తే చూస్తా! జాగ్రత్త" ఆయనబయటకు వెళ్ళిపోయాడు.
రాధ ఇరుగు పొరుగు పిల్లలతో కలిసి కాలేజీకి వెడుతోంది. కలసి యింటి
కొస్తోంది. అర్జున్ మాట మరిచిపోయి హాయిగా చదువుకుంటోంది.

ఇంట్లో వాళ్ళు కూడా ఆ విషయం మరిచిపోయారు.

ఒకనాడు కాలేజీకి వెడుతున్న రాధకి అర్జున్ ఎదురు పడ్డాడు.
అతను ఎంత పలకరించినా ఆమె నోరు విప్పలేదు. ఆ రోజు రాధకి
స్పెషల్‌క్లాసు ఉంది. అందుకే కూడా ఎవరులేరు.

"రాధా! నువ్వు మాట్లాడకపోతే ఆ చెరువులోపడిచస్తా" అంటు
దూరంగా ఉన్న చెరువు చూపించాడు.

రాధ కంగారుపడింది, జాలిపడింది. ఎవరుచూడకుండా అతని
వెంట చెరువుకట్టకు వెళ్ళింది.

"రాధా నువ్వంటే నాకెంత యిష్టమో తెలుసా!"

"తెలీద"ని తలూపింది రాధ.

"నిన్ను చూడకుండా నేనుండలేను రాధా! ఇదిగో నాప్రేమ
కానుక" ఓ గులాబి పువ్వును రాధకు అందిచాడు. ఆ పువ్వు అందుకొని
ఆమెకు తల్లోపెట్టుకోవాలని ఉంది. కాని తండ్రి గుర్తుకు రావడంతో
చెయ్యిచాపలేకపోయింది.

అతనే చొరవగా ఆమె తలలో పూవు పెట్టి ఆమె చెయ్యి అందు
కున్నాడు.

అలా చెయ్యకూడదని రాధకు తెలుసు. కాని అప్పుడే పురులు
విప్పుతున్న కొత్తకోరికలు కాదనలేకపోయింది. ఆ చేతిని తన పెదాల
వరకు తీసుకువెళ్ళి ముద్దుపెట్టుకున్నాడు.

రాధ మనసు మూగపోయింది. ఆమె శరీరం వణికింది. ఏదో

లోకాల్లోకి వెళ్ళిపోయింది.

అంతలోనె తండ్రి యమధర్మరాజులా కళ్ళముందు నిలిచాడు. ఏదో తప్పు చేసాననే భయం ఆమెను ఆవరించింది. అర్జున్‌తో ఏమి చెప్పకుండానె యింటివైపు పరుగెత్తింది. అర్జున్ ఎంత పిలుస్తున్నా వెనుతిరిగి చూడలేదు.

"ఏమ్మా! క్లాసుకి వెళ్ళలేదా?" కంగారుగా పరుగెత్తుకుంటూ వస్తున్న కూతుర్ని చూసి తల్లి అడిగింది.

"లేదమ్మా! ఎందుకో భయమేసింది. వెనక్కి వచ్చేసాను." తల్లికి చెప్పడం పూర్తయినట్లుగా గదిలోకి వెళ్ళిపోయింది. అర్జున్ సంగతి చెప్పలేకపోయింది. మరునాడు క్లాసులో ఉండగా అర్జున్ వచ్చి పిలిచాడు. వెళ్ళిపొమ్మని ఆమె కళ్ళతో బెదిరించినా అతను వెళ్ళలేదు. అక్కడే నిలబడ్డాడు.

ఇంట్రవెల్‌లో బయటకువచ్చి అతని వెంట నడిచింది. ఆమె క్లాసు పిల్లలు ఆమె యింటికి దగ్గరగాలేరు. ఆమెతో కలిసి వచ్చే పిల్లలు పదవతరగతిలోనే ఉన్నారు. అందుకే ఆమె క్లాసులో లేకపోయినా ఎవరు గమనించలేదు.

ముందు రోజులాగె ఇద్దరు చెరువు కట్ట దగ్గర కూర్చున్నారు. అర్జున్ ఆమెకు దగ్గరగా జరిగాడు. ఆమె రెండు చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు. రాధ విడిపించుకునే ప్రయత్నం చెయ్యలేదు. శరీరంలో ఏదో క్రొత్త గగుర్పాటు. అతనికి మరింత దగ్గరవ్వాలనే తపన ఆమెను జయించింది. అతను రెండు చేతులతో గాఢంగా తనహృదయానికి హత్తుకున్నాడు. ఆమె అతని వడిలో వాలిపోయింది. బాహ్య ప్రపంచంతో వారికి సంబంధమేలేదు. మొదట తేరుకున్న రాధ చుట్టూ చూసింది. ఎవరూ కనపడలేదు.

"అమ్మయ్య! ఎవరూ చూడలేదు." అనుకుంటూనె అతని కౌగిలి నుండి విడిపించుకుంది. లంగా వోణీ సర్దుకుని కాలేజీ వైపు కదిలింది.

అంతలో ఇద్దరు రైతులు అర్జున్‌నిచుట్టుముట్టారు. అతనిని పంచాయతీ దగ్గరికు లాక్కుంటు తీసుకువెళ్ళారు.

రాధకి ఆ విషయం తెలియదు. అందుకే కలేజీ నుంచి పొలాలమ్మటగట్ల యింటికి బయలుదేరింది.

ఇంతలో అర్జున్ ఎదురు వచ్చాడు.

"ఎందుకు భయపడుతున్నావు రాధా! మనం పెళ్ళి చేసుకుని ఈ స్వార్ధ పరులకి దూరంగా వెళ్ళిపోదాం! వీళ్ళు మనని కలిసి బతకనివ్వరు రాధా! నువ్వు లేందే నే బతకలేను రాధా!" అర్జున్ ఆమె రెండు చేతులు పట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చాడు.

"అర్జున్ తొందరపడుతున్నావు! మనిద్దరికి చదువుల్లేవు! డబ్బు లేదు? ఆస్తిలేదు! ఎలా బతకగలం. ఎక్కడ ఉన్నా మా నాన్న వెతికి పట్టుకుంటాడు. ఆయన పట్టుదల నాకు తెలుసు. నువ్వు చదువు పూర్తి చేసుకుని ఉద్యోగం సంపాదించు అర్జున్. అప్పుడు పెళ్ళిచేసుకుందాం?"

"అలా అనకురాధా! నువ్వు లేందే నాకు ప్రపంచంలేదు. చదువు లేదు. తిండిలేదు? పెళ్ళి చేసుకుని వెళ్ళిపోదాం రాధా! పట్నం వెళ్ళి కూలి పని చేసుకుని బతుకుదాం! నువ్వుకాదంటే మీ నాన్న వాళ్ళ దగ్గరకే వెడతాను వాళ్ళే నన్ను కొట్టికొట్టి చంపేస్తారు. నువ్వు లేకుండా బతకడం కంటే అదే నయం రాధా! అదేనయం"

"మన పెళ్ళి ఎవరు చేస్తారు? మన పెళ్ళికి సాక్ష్యు లెవరు?" మేళ తాళాలేవి? విందు భోజనాలేవి? మనకి ఏ సరదాలు అక్కరలేదా? అర్జున్" ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది.

"రాధా! మన పెళ్ళి మనమే జరుపుకుందాం! ఈ పచ్చని చెట్లు

ఈ పంట పొలాలు, ఎగిరే పక్షులు ఇవే మనకు సాక్ష్యం. నీకిష్టమైతేనే ఈ పెళ్ళి చేసుకుందాం! నువ్వు ఆలోచించుకుని చెప్పు రాధా!''

రాధ మనస్సులో ఒకపక్క కొత్త కోరికలు మరోపక్క అంతులేని భయం. ఒకపక్క నవ యువకునితో స్వర్గ సుఖాలు — ఒకపక్క పెంచిన తల్లి తండ్రులు—భోగాలు—సౌకర్యాలు—అంతస్థులు.

ఇంక జీవితంలో తన యింటికి వెళ్ళలేదు. తండ్రి గుమ్మం ఎక్కనీడు.

ఇటే మళ్ళింది మనస్సు.

"మనం పెళ్ళి చేసుకుని దూరంగా వెళ్ళిపోదాం అర్జున్!" ఆ మాటలు విని అతను సంతోషంతో ఊగిపోయాడు. "రాధా! అంటూ ఆమెను మరింత గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు. దెబ్బలబాధే మరిచిపోయాడు. తమపక్కనే ఉన్న అరటి చెట్టు తడపలాగి తాడులా పేనాడు. పక్కనే గట్టుమీద ఉన్న తాటి మొక్క మొవ్వాకు తెంపి మడిచి మధ్యలో మంగళ సూత్రంలా ముడివేసాడు.

రాధ ఆశ్చర్యంగా అతన్నే చూస్తోంది.

"రాధా! ఈ పచ్చని తోటలు సాక్షిగా, ఈ పంట పొలాలు సాక్షిగా, ఎగిరే స్వేచ్ఛా పతంగాలు సాక్షిగా, ఈ జన్మభూమి సాక్షిగా, సూర్యుని సాక్షిగా మనం పెళ్ళి చేసుకుంటున్నాం." అంటు ఆమె మెడలో మూడు ముళ్ళు వేసాడు. పచ్చని ఆకులు తెంపి ఇద్దరు తలంబ్రాలు పోసుకున్నారు. ఆ పక్కని బోదిలో పారుతున్న నీరె పన్నీరులా ఒకరి మీద ఒకరు జల్లుకున్నారు. ఇద్దరు ఆనందంతో పకపకా నవ్వుకున్నారు. ఆ నవ్వుతో దిక్కులు నిండిపోయాయి. ఇళ్ళకు చేరుతున్న పక్షులు శృతులు కలిపాయి.

మొదటిసారిగా అర్జున్ ఆమె పెదాలనుచుంబించాడు. ఎన్నడూ

చవిచూడని ఆ సుఖానికి రాధ మైమరచిపోయింది. ఏ సుఖంకోరి అతన్ని పెళ్ళి చేసుకోవాలనుకుందో ఆ సుఖంలో మునిగిపోయింది రాధ. ఎప్పుడో ఘనంగా పెళ్ళి చెయ్యాలనుకున్నారు. తల్లి తండ్రులు కాని ఆ సుఖాన్ని ముందుగా అందుకోవాలని కాబోలు రాధతల్లి తండ్రులనే వదలివేసింది.

అప్పటికే చుట్టూ చీకటి ఆవరించిందని ఆ నవదంపతులకి తెలియ లేదు.

రాధ యింటికి రాలేదని తెలుసుకున్న చలపతిగారు తన మను ష్యుల్ని నాలుగు వైపులకి పంపాడు— అర్జున్ కనబడితే కటకటాల్లో పెట్టించమని ఆజ్ఞాపించాడు. సోమడున్న ఇంటిచుట్టూ మనుష్యుల్ని కాపలా పెట్టాడు.

"ఎవరక్కడ? ఎవరక్కడ? దూరంగా అరుపులు, కర్రల చప్పుళ్ళు! కొరవి దెయ్యాల్లా మిణుకు మిణుకు మంటున్న లాంతర్లు.

"మీ నాన్న మనల్ని వెతకడానికి మనుష్యుల్ని పంపినట్టున్నాడు. వీళ్ళముందు ఆయమ కింకర్లే నయం. మనం పారిపోదాం రాధా!"

"ఎక్కడికి పారిపోగలం మనం. ఇంకా తోట మధ్యలోకి వెళ్ళి అటు నుంచి వెనక్కి వెడదాం! వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత ముందుకు వెళ్ళి పోదాం."

రాధ మాటలు కాదనలేకపోయాడు అర్జున్. ఇద్దరు ఒకరి చేతులు ఒకరు పట్టుకుని ఆ కటిక చీకటిలో మృత్యుముఖంలోకి అడుగు పెడు తున్నట్లుగా కదిలారు.

అరుపులు, కర్ర చప్పుళ్ళు, అడుగుల చప్పుళ్ళు దూరమయ్యాయి. రుద్ధ గుండెల మీద చేతులు వేసుకున్నారు.

అరటి తోటకు నీరు పట్టినట్టున్నారు. కాళ్ళు బురద మట్టిలో దిగ

బడి పోతున్నాయి. కళ్ళు పొడుచుకు చూసినా కనపడని చీకటి, అంతలో ఏదో కాళ్ళకు అడ్డుపడితే కెవ్వుమంది రాధ.

అర్జున్ ఆమె పాదాల దగ్గర చేయి పెట్టిలాగి పట్టుకున్నాడు. గుండ్రంగా మెత్తగా తగిలింది. అది తాడుకాదు-బురద పాము కాబోలు. చేతులు వణుకుతుంటే అర్జున్ దూరంగా విసిరాడు. భయంతో రాధ అతన్ని వాటేసుకుంది. ఆమెను అలా పొదివిపట్టుకునే అర్జున్ ముందుకు నడిచాడు.

చేతిలో లాంతర్లతో రాక్షసుల్లాంటి మనుష్యులు దూరమయ్యారు. వారి అరుపులు దూరమయ్యాయి. ఆనవదంపతుల భయం కాస్త తగ్గింది.

వారిని వెతుక్కుంటూ అర్జున్ స్నేహితుడు ఎంకన్న అక్కడకు వచ్చాడు. అతనిచేతిలో బ్యాట్రీలైటు ఉంది.

''అర్జున్—అర్జున్" అంటు నెమ్మదిగా పిలిచాడు.

అర్జున్ ఎంకన్న గొంతు గుర్తుపట్టాడు సముద్రంలో కొట్టుకుపోయె వారికి నావదొరికి నట్లయింది.

''ఎంకన్నా! ఇటు! ఇటు" మరి కాస్త ముందుకు వచ్చి సమాధానమిచ్చాడు.

ఎంకన్న వారిని కలుసుకున్నాడు. చేతిలోని బాట్రిలైటు వేస్కి వాళిద్దరిని ఒకసారి చూసాడు

రాధ మెడలో అరటి తడపకు పచ్చని తాటి ఆకు.

ఎంకన్నలో తెలియనిభయం ఆవరించింది.

"అమ్మా! మీరు సానా తొందరపడ్డారమ్మా! మీరు పెద్దకులస్తులు- మీ వాళ్ళకు కులం పట్టింపు లెక్కువ. వీడిని పెళ్ళి చేసుకుంటె జీవితాంతం మీ వాళ్ళు మ్మిమల్ని కన్నెత్తి చూడరు, అంతే కాదమ్మా ఈడు కళ

బడితే బతకనివ్వ౦రమ్మా! ఈడి యింటిచుట్టూ కావలిపెట్టాడు మీనాయన. మా యువతరం రెచ్చిపోయి కత్తులు, కర్రలు తీసారు. వారిని సముదాయించి వచ్చాను. ఇవి పల్లెలు. మాట పట్టింపులువస్తే తలలు తీసేసుకుంటారు. ఈడికి తింటానికి తిండిలేదు. కట్టుకోడానికి గుడ్డలేదు. ఉంటానికి కొంపలేదు. ఏంసుఖపడదామని ఈడిఎంటఉన్నావమ్మా! ఇద్దరికి సదువు ల్లేవు? సంపాదనల్లేవు? ఎలాబతుకు తారమ్మా! సదువులు పూర్తయ్యే వరకు తొందర పడకుండా ఉండవలసింది."

అతని ఆచిన్న ఉపన్యాసానికి రాధ వెక్కి వెక్కి ఏడువు ప్రారంభించింది.

"ఏడవకండమ్మా! మీరెల్లి పోతానంటె మీ యింటి దగ్గర దిగబెట్టి వత్తానమ్మా! మీ వోళ్ళకినచ్చచెబుతాను"

"ఒద్దు వెంకన్నా! ఒద్దు! అంతపని మాత్రం చెయ్యకు. ఇద్దరం ప్రేమించుకున్నాం. పెళ్ళిచేసుకున్నాం. కష్టమైన, నష్టమైన ఇద్దరం కలిసి పంచుకుంటాం! అవసరమైతే ఇద్దరంకలిసే చచ్చిపోతాం!"

"మీరా మాట మీదె ఉంటానంటే యింకేం కావాలమ్మా! రండి! ఎవరు చూడకుండా పట్టణం వంపించేత్తాను."

ఎంకన్న ఆ చీకట్లో ముందు నడిచాడు. అతను చూపించే బ్యాట్రీ లైటు కాంతిలో ఆ యిద్దరుముందుకునడిచారు.

చలపతిగారి మనుష్యులు ఊరంతా గాలిస్తూనె ఉన్నారు. వాళ్ళు కనపడగానె ఏచెట్ల చాటుకో తప్పుకుంటూ బయలుదేరారు. రోడ్డురాగానె చాటుగానిలబడ్డారు ముగ్గురు. ఎదురుగా వస్తున్న లారీని ఆపి ఇద్దరిని ఎక్కించాడుఎంకన్న. చీకటి ఉండగానె పట్నం చేరుతారనుకున్న ఎంకన్న గుండెలమీద చేయివేసుకున్నాడు.

లారీ హారన్‌కొట్టుకుంటూ ముందుకు వెళ్ళిపోయింది. చలపతి మను

ష్యులు ఎంకన్నను చూసి చుట్టుముట్టారు.

ఎంకన్న కూడా వెతుకుతూన్నట్లు నటించాడు. కాని వాళ్ళు అతనిని నమ్మలేదు.

"ఎవడ్రా అడు! ఏసేయండి" వెనకనించి ఒకడు అరిచాడు. అంతే ఎంకన్న మీద చేతి కర్రలు నాట్యాలు చేసాయి.

"నాకేం తెలీదుబాబు నేను కూడా ఆళ్ళనే ఎతుకుతున్నా" ఎంకన్న మాటలు ఎవరూ వినుపించుకోలేదు.

"నన్ను కొట్టకండి బాబూ! నన్ను కొట్టకండి" ఎంకన్న అరుస్తూనె ఉన్నాడు.

"నిజంగా ఈడికి ఏమీ తెలీదంటావా?" నిలబడి కొట్టిస్తున్న వ్యక్తి కాస్త ఆలోచించాడు.

"ఏమో ఎవరికీ తెలుసు?" అతని పక్కనున్న వ్యక్తి సమాధాన మిచ్చాడు.

"నిజంగా యీడుచస్తే మనకి వీడితో మరోతంటారా! వదలేయండిరా!"

అతని మాటలకి అందరు ఒక్కసారి ఎంకన్నని కొట్టడంఆపారు.

అంతా నిశ్శబ్దం. ఎంకన్న మూలుగే భయం కరంగా వినబడుతోంది.

కొనఊపిరితో ఉన్న అతన్ని అక్కడే వదిలేసి వాళ్ళు ముందుకు వెళ్ళిపోయారు.

పట్నం నుంచి వస్తున్న భీమునికి ఆమూలుగు వినబడింది. సైకిలు ఆపి పరిశీలనగా చూసాడు. ఆచీకటిలో తన తమ్ముడు ఎంకన్నని గుర్తుపట్టాడు.

"ఎంకన్నా! ఏం జరిగిందిరా!" అతన్ని తడిమి చూసాడు. చావు

బతుకుల్లో ఉన్న అతన్ని సైకిలు మీద పెట్టుకుని ఆసుపత్రి వైపు కదిలాడు. ఆవేళలో ఆసుపత్రికి తాళంఉంటుందని తెలుసు. అయినా ఏదో ఆశ. అంత చీకటిలోను తాళం కనబడింది. ఎంకన్నను అరుగు మీద పడుకోపెట్టి వెళ్ళి కాంపౌండర్ని పిలుచుకువచ్చాడు. కాంపౌండరు పరుగెత్తి కెళ్ళి పక్కనే ఉన్న డాక్టర్ని పిలుకువచ్చాడు.

ఆ డాక్టరు ఆవూరికి కొత్త. అతనికి ఆవూరు రాజకీయాలు తెలియవు. ఎవరి గుప్పిట్లోనులేడు. అర్ధరాత్రి వచ్చి తలుపులు తెరచి లైట్లువేసాడు. ఎంకన్న ప్రాణాలు ఎప్పుడోపోయానిని తెలుసుకున్నాడు.

ఆవార్త ఊరంతాపాకింది. ఎంకన్న గూడెంలోని జనంఆవేశంగా ముందుకు వచ్చారు. సోమడు ఎంత బతిమాలినా వాళ్ళు వినిపించుకో లేదు.

గ్రామ పెద్దలు కూడా అక్కడకి చేరుకున్నారు.

ఎంకన్న దహనానికి డబ్బు ఇస్తామన్నారు.

అవసరంలేదంటూ అరిచారు ఎంకన్న జనం. సోమడు వాళ్ళ వాళ్ళని అదుపుచేసాడు.

ఎంకన్న శవాన్ని తీసుకువెళ్ళారు.

ఊరంతా కోప తాపాలతో పొగలు శగలు కక్కుతోంది. ఎవర్ని ఎవరు పొడుచుకుంటారో తెలియడంలేదు.

రాధ తల్లి మాత్రం శోక దేవతలా ఏడుస్తూనె ఉంది. అంత గారంగా పెంచిన కూతురు అడవిపాలైపోయింది. ఆవిడ దుఃఖానికి అంతులేదు. ఆవిడనుఓదార్చేవాళ్ళులేరు. సూర్యం మతిలేకుండాఉన్నాడు.

"అది చచ్చిందనుకుంటాను. నా కులాన్ని నాశనం చేసింది. నా కుటుంబ మర్యాదలు మంటకలిపింది. అది బతికుండగానె కర్మ కాండలన్ని పూర్తిచేసేస్తా" చలపతిగారు మతిచలించిన వానిలా కోపంతో

ఊగి పోతున్నాడు. అతన్ని ఎవరు పలకరించినా మరింత రెచ్చిపోతు న్నాడు.

"ఆ పెద్దింటి పిల్లకాదు కాని నా బిడ్డని సంపడానికే పుట్టిందిరా! ఆ పిల్ల సంగతి మనకేటిరా అంటె యిన్నాడు కాదురా" అర్జున్ తల్లి ఏడుస్తూనెఉంది.

"నీ గోలేటిః సంపుతున్నావ్ ఆడికేంబయంలేదు." సోముడు లోపలభయంతో వణుకుతున్నా పైకి భార్యని మందలించాడు.

ఏడుపులతో, పెడబొబ్బలతో, భయాందోళనలతో జనం కుత కుతలాడుతున్నా పొగలు రాత్రి అవుతూనె ఉన్నాయి. రోజులు గడచి పోతూనె ఉన్నాయి.

"ఓ యప్పాః నీ కొడుకుని కోడల్ని నూసినాః నీ కోడలు సానా ముద్దుగా ఉంది" రంగమ్మ వచ్చి చెప్పింది.

''అవుః నాకొడుకు గొప్పోడేః నాకొడుకంటె ఏటనుకున్నావుః" అర్జున్ తల్లి అంతలోనె సంబరపడింది.

"దాన్ని తీసుకొచ్చి మరో పెళ్ళి చేస్తాః పుస్తిలేనాకట్టని పెళ్ళి ఓ పెళ్ళాః మంత్రాలే నాచదవనిదే అది పెళ్ళవుతుందాః దాన్ని తీసుకొచ్చి మరో పెళ్ళి చేస్తా!" చలపతిగారు కోపంతో అరుస్తూనె ఉన్నారు. ఊరి మధ్యలోకి వెళ్ళడమే మానేసాడు. లేనిపోని అనుమానాలతో అవమా నాన్ని ఊహించుకొని ఉడుకు మోతుతనంతో ఊగిపోతున్నాడు. తన కుల గౌరవం చెడిపోయిందనే బాధే కాని కూతురు ఎలా బతుకుతుందనే ఆలోచనేలేదు.

పట్నం చేరుకున్న అర్జున్, రాధ ఊరిచివర గుడిసెలో కాపురం పెట్టారు. దూరంగా కడుతున్న కాంప్లెక్స్ పనిలో ఇద్దరు కూలిపనికి కుదిరారు. అర్జున్ కష్టపడి పనిచేస్తున్నాడు. అలవాటులేని రాధ ఒక

రోజులోనె తోటకూర కాడలా వడిలిపోయింది. ఆ రాత్రి కాళ్ళు చేతులు లాగడంతో నిద్రేపోలేదు తెల్లవార్లు మూలుగుతూనె ఉంది. అర్జున్ భయ పడి పోయాడు.

తెల్లవారెసరికి కాస్త జ్వరం కూడా వచ్చింది. ఏనాడు వంటచేసి ఎరుగని రాధకు అన్నం వండడమే కష్టమైపోయింది. ఇంటి నిండా సామానులు, సరకులతో కలకలలాడె వంటిల్లునే చూసింది రాధ. ఈనాడు ఇంట్లో ఏ సామానులేదు. ఏ సరకులేదు. గుడిసెబయట చిన్న చిన్న కట్టెపుల్లలతో కుండతో అన్నం వండాలంటె ఆమెకు చేతకాలేదు. బట్టలు ఉతకాలంటే నీళ్ళులేవు. బకెట్టులేదు. అసలు కట్టుకోడానికి మరో చీరెలేదు. ఉతకడానికి బట్టలు ఎక్కడివి?

అర్జున్ పడుకోడానికి ఓ నులకమంచం తెచ్చాడు. పరచుకో డానికి ఓ దుప్పటికూడా లేదు. అన్నం తినడానికి కూర, పప్పు, పచ్చడి ఏమీలేక ఆమె తినలేకపోతోంది. అర్జున్ అంటె ఆమెకు అమితమైన ప్రేమ. అందుకే ఈ కష్టాలన్నీ భరిస్తోంది.

రాధ పచ్చని రంగు నలుపురంగుగా మారిపోయింది. నల్లని జుట్టు తైల సంస్కారంలేక ఎఱ్ఱని పీచులా తయారయింది. శరీరం చిక్కి నీరసించి పోయింది. చిరిగిన చీర, రవికతో కూలి పనికి వెడు తూనె ఉంది. ఆమెను చూసి అర్జున్ బాధపడుతూనె ఉన్నాడు. అతని ఓదార్పు మాటలతో కరిగిపోతోంది.

రాధకు నెల తప్పింది. ఓ పక్క వేవిళ్ళు—ఏదీ తినలేకపోతోంది. ఆమెకు ఏవి తినాలని ఉందో అవి అందుబాటులోలేవు. అయినా అర్జున్ కౌగిలిలో సర్వం మరిచిపోతోంది.

ఆమెకు వేవిళ్ళు మరింత ఎక్కువయ్యాయి. వాంతులతో మరింత బాధపడుతోంది. కూలిపనికి వెళ్ళలేకపోతోంది. వెళ్ళకపోతే తిండి

దొరికేదారిలేదు.

"రాధా! ఈ పదిరూపాయలు తీసుకుని గవర్నమెంటు ఆసుపత్రికి వెళ్ళి మందులు తెచ్చుకో" కూలి పని దగ్గర అప్పు తీసుకున్న అర్జున్ పది రూపాయలు ఆమె చేతిలో పెట్టాడు.

"వంటరిగానా, నాకు దారితెలీదు. వెళ్ళను." రాధ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"అలా అనకు రాధా! అదిగో ఎదురుగా కనపడేదే ఆసుపత్రి! నేను పనికి వెళ్ళకపోతే ఈరోజు నీకు తిండికూడా పెట్టలేను రాధా! నా మాట విను. మెల్లిగా వెళ్ళిరా! ఈరోజు నువ్వు పనికి రాకు. ఇంట్లోనె ఉండు." ఆమె ముంగురులు సవరిస్తూ చెప్పాడు.

"అలాగె" అంటు చిన్న పిల్లలా తలూపింది రాధ.

అర్జున్ పనికి వెళ్ళిపోయాడు. రాధి కట్టుకున్న పాత చీరే విప్పుకుని మరోసారి కట్టుకుంది. రెండు చేతులతో జుట్టు దగ్గరగా చేసుకుంది తడికెను దగ్గరగా లాగి రోడ్డు మీదికి వచ్చింది.

"ఏడకి ఎల్తున్నావు?" అక్కడే కూలిపనిచేసే అంతమ్మ రాధను పలకరించింది.

"హాస్పటల్ కి" రాధ సమాధాన మిచ్చింది.

"నేను ఆడికే" అంతమ్మ ముఖం వికసించింది. ఇద్దరు నడక ప్రారంభించారు.

పనిమీద పట్నం వచ్చిన చలపతి, వర్ధనమ్మగారు రిక్షాలో బస్సుస్టాండుకి వెడుతున్నారు. హాస్పటల్ మీదుగానె బస్సుస్టాండుకి వెళ్ళాలి. చలపతిగారు ఓ షాపు దగ్గర రిక్షా ఆపి దిగాడు. ఆయన ఏవో సరుకులు కొంటున్నాడు. ఇంతలో రిక్షాలో కూర్చున్న తల్లి రాధను చూసి గుర్తుపట్టింది.

"అమ్మా! రాధా! రాధా" అరచుకుంటూ ఆవిడ రిక్షా దిగి రాధ వైపు అడుగులు వేసింది. రాధ కూడా తల్లిని చూసింది. ఆవిడ రాధకు దగ్గరగా వచ్చింది.

16 సం॥రాలు అల్లారు ముద్దుగా పెంచిన తల్లి. రాక కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"అమ్మా! రాధా!" అంటు ఆవిడ రాధను కౌగలించుకోబోయింది. రాధ పక్కనే ఉన్న ఆ అమ్మాయిని చూసి ఆగిపోయింది.

"అమ్మా!" అంటు తల్లి వడిలో వాలిపోవాలనుకున్ని రాధ ముందుకు అడుగు వేసింది. కాని అంతలోనె మురికి పట్టిన బట్టలు చూసుకుని వెనక్కి అడుగువేసింది.

రాధను నిధానంగా చూసిన ఆ తల్లి హృదయం బ్రద్దలయింది.

"ఇదేమిటీ రాధా! అయ్యో యిలా చిక్కిపోయావేమిటి? అయ్యో! ఈ బట్టలేమిటీ తల్లీ!" వర్ధనమ్మ వెక్కివెక్కి ఏడ్చింది.

"అమ్మకు నెల తప్పిందమ్మా!" పక్కనున్న అంతమ్మ మెల్లిగా చెప్పింది.

"అలాగా! నాతల్లే! అయ్యో! నాకు ఎంత సంతోషాన్నిస్తున్నావే? నాతో వచ్చేయమ్మా! మళ్ళీ వచ్చేద్దువుగాని. రా అమ్మా!" ఆవిడ ఏమేమో అంటోంది.

రాధ అలాగె నిలబడి చూస్తోంది.

"ఇవిగో రాధా! ఈ డబ్బెట్టి బట్టలు కొనుక్కో పళ్ళు కొనుక్కో" అంటూ ఆవిడ పర్సులోంచి డబ్బు తీసింది.

"అమ్మా! నాకొద్దమ్మా! పిన్ని ఎవరినో ప్రేమిస్తే మీరందరు కలిసి వైభవంగా పెళ్ళి చేసారు. కాని నేను ప్రేమిస్తే వెనిరికొట్టారు మీకులస్తుడు కాదనేకదమ్మా! చంపమన్నారు. అతను పనికిరానప్పుడు.

నేనెలా పనికివస్తానమ్మా!" రాధ మాటలకి ఆవిడ మనస్సు మరింత బాధ పడింది.

"పంతాలు పట్టింపులు ఎందుకమ్మా! ఇది నా డబ్బు. అంటే నీ డబ్బేనమ్మా!"

"రాధ అనుకోకుండా చేయిచాచింది. ఆవిడ తన చేతితో ఉన్న డబ్బు రాధ చేతిలో పెట్టింది.

అంతలో ఎక్కడనుంచి వచ్చాడో తండ్రి అక్కడకు వచ్చాడు. రాధ చేతిలోని డబ్బును అమాంతం లాక్కుని జేబులో కుక్కుకున్నాడు.

''నీ మొఖానికి డబ్బెందుకే! నీవు బతకడంకంటె చావడం మంచిదే! నీ మొహం చూస్తేనె పాపాలు చుట్టుకుంటాయి!'' అంటునె ఆయన "రావేం! అక్కడేం చేస్తున్నావు?" భార్యను గదమాయించి రెక్క పట్టుకులాక్కువచ్చి రిక్షా ఎక్కించాడు.

"అదేమిటండీ! ఆ పిల్ల ఎండలో కళ్ళు తిరిగి పడిపోయిందండీ! పిల్లలేందే మనకి డబ్బెందుకుండీ! పిల్ల చేతిల్లోంచి లాక్కోడానికి మీకు చేతులెలా వచ్చాయండీ!" ఆవిడ ఆర్తనాదాలు గాలిలో కలిసిపోతున్నాయి. రిక్షా ముందుకు వెళ్ళిపోతోంది.

రాధ చుట్టూ జనం చేరారు.

"ఆడకూతురు ఏం చేస్తాది. ఆడిచేతులు పడిపోను ఆడు తండ్రి కాడు. పాపిష్టోడు." అందరు తలో మాట అంటున్నారు.

రాధను మెల్లిగా లేవతీసి యింటికి పంపారు. తల్లిని తలచుకుని రాధ అలా ఏడుస్తూనె ఉంది. సాయంకాలం ఇంటికి వచ్చిన అర్జున్ నీరసంగా పడిఉన్న రాధను చూసాడు.

"రాధా! ఆసుపత్రికి వెళ్ళలేదా?" ఆమె తల నిమురుతూ . అడి

గాడు. రాధకు దుఃఖం పొంగి వచ్చింది. జరిగిన సంగతంతా చెప్పి మరింత ఏడ్చింది.

"ఈ అవమానాలన్నీ మనకి మామూలె. బాధపడకు." ఆమెను ఓదార్చాడు అర్జున్. అతనే అన్నం వండి ఆమె చేత తినిపించి తాను కాస్త ఎంగిలి పడ్డాడు.

రాధకు అన్నం తింటుంటె కడుపులో దేవినట్లయింది పొగ వాసన పైగా మట్టికుండ వాసన. అయినా అలాగె వాంతి కాకుండా ఆపు కుంది. అలసటగా అతని వడిలో వాలిపోయింది. ఇద్దరు నిద్రలోకి జారి పోయారు.

అర్ధరాత్రి అయింది. ఏదో పొగగొట్టు. ఇద్దరికి మెళకువ వచ్చింది. కళ్ళు విప్పిచూసారు.

"అర్జున్ ఈ పొగేమిటి అదిగో మంటలు. అర్జున్ రాధను పట్టు కుని బయటకు పరుగెత్తబోయాడు అప్పటికే చుట్టూ మంటలు—

పక్కవాళ్ళు లేచారు. మంటలు ఆర్పడానికి దగ్గరగా నీళ్ళేలేవు. అయినా ఉన్న నీళ్ళతోనె మంటలు ఆర్పడానికి ప్రయత్నం చేసారు.

అయినా తాటాకు గుడిసెలు. ఎంతసేపు కాలుతాయి. పోలీసులు పరుగెత్తుకుంటూ వచ్చారు. మాడి కట్టెల్లా ఉన్ని ఉద్దరి శవాల్ని బయ టకు తీశారు.

"ఎవరయ్యా వీళ్ళు" పోలీసులు పక్కవాళ్ళనడిగారు.

"ఈళ్ళు ప్రేమించుకుని పెళ్ళి చేసుకున్నారు. పల్లెనుంచి యిక్క డకు వచ్చారు. నిన్న తండ్రి తల్లి ఈళ్ళని చూసారు. ఆ తండ్రి నా నా మాటలు మాట్లాడాడు బాబు. ఆళ్ళు పెద్ద కులస్తులు— బాబూ ఈళ్ళేమి లెక్క....

కులం త్రాసులో ప్రాణం విలువ—ఇదిగో బూడిదంత బాబూ!" బూడిదను చేత్తో తీసి చూపించాడు పక్క గుడిసెలోనె ఉంటున్న తాత. ఆమాటలు అందరి గుండెల్లో శూలాల్లా దిగాయి. అందరి కళ్ళల్లోను నీళ్ళు తిరిగాయి.

"మరెక్కడా యిలా జరక్కుండా చూడండి బాబూ!" అంటూ ఆ తాత పోలీసుల చేతులు పట్టుకున్నాడు.

ఆ విషయం తెలిసిన వర్ధనమ్మగారు కడుపు శోకంతో ఏడుస్తూనె ఉంది. చలపతిగాదు కర్మ కాండలన్నీ యధా విధిగా జరిపించి చేతులు దులుపుకున్నాడు. తమ్ముడు సూర్యం అక్కకో సంఏడుస్తూనే ఉన్నాడు.

1—2—1994

—o— —o— —o—